# ఈవెంట్ మేనేజర్

– డా॥ సోమరాజు సుశీల

ఇప్పటి మాటా! ఎప్పుడో యాభై ఏళ్లనాటిది. రెండో ప్రపంచ యుద్ధం డిప్రెషన్‌లో చిత్తయి కుదేలయిపోయిన కుటుంబంలో పెద్దపిల్ల పెళ్లి. అదీ మేనమామతో, గుడి సత్రంలో. ఎవరు మగ పెళ్లివారో, ఎవరు ఆడ పెళ్లివారో ఖచ్చితంగా చెప్పలేని పరిస్థితి. పెళ్లివారి బస్సు సత్రం ముందు ఆగగానే పెళ్లికూతురి తల్లి వియ్యపురాలిని కావలించుకుని 'అమ్మా' అంటూ బావురుమంది.

'తప్పు! తప్పు! శుభమా అంటూ పెళ్లివారొస్తే అలా కళ్లనీళ్లు పెట్టుకోకూడద'ని పెద్దవాళ్లు కేకలేశారు. ఆ ఏడుపేదో అప్పగింతలయ్యాకంటూ కన్యాదాత కసురుకున్నాడు.

'మీ ఇంట్లో అందరూ ఇంతే! మనసులు మహా కఠినం! మన చిట్టిగాడుండుంటే ఈవేళ ఎంత సందడి! అక్కని నేలమీద నడవనిచ్చేవాడా? మీరొక్కరే అన్ని పనులూ నొల్లుకుంటూ సైకిలు మీద తిరిగేవారా? నా బతుకే పాపిష్టిది'– ఐదేళ్లనాడు రెండు రోజుల జ్వరంతో కన్నుమూసిన కొడుకుని తల్చుకుని మళ్లీ ఇంకొక్క వరస కళ్లనీళ్లాపుకుంటూనే తమ్ముడికి, అదే కాబోయే అల్లుడికి హారతిచ్చింది. ఆ రోజులలో మనుషులు పోయి పదేళ్లయినా కూడా శుభాశుభాలప్పుడు అయినవాళ్లు కనిపిస్తే కళ్లనీళ్లు నదులుగా ప్రవహించేవి. మరిప్పుడు ఎవరైనా పోయారని పలకరిద్దామని ఏ మర్నాడో వెడితే పిజ్జాలో బిరియానీలో తెప్పించుకుని, సీరియల్స్ చూస్తూ తింటూ వుంటారు పోయినవాడి ఫొటో ముందుంచిన అగరొత్తుల పొగకి దగ్గుతూ. విషాదాన్ని వెంటనే మర్చిపోవడం ఇప్పటి పద్ధతి. ఒక్క రాజకీయ నాయకులు పోతే మాత్రం టి.వి. సాక్షిగా దేశమంతా మూడు రోజులేడుస్తుంది.

బస్సు దిగిన వాళ్లు పెద్ద పెళ్లివారిలా డాబుగా ఏం లేరు. తెల్లారగట్ల లేచి బస్సులో కోటిపల్లి రేవుకొచ్చి గోదారి దాటి, మళ్లీ బస్సెక్కి నాలుగింటికి విడిదికి చేరిన వాళ్లెంత నీరసంగా దుమ్ముకొట్టుకు పోయుంటారో అలాగే వున్నారు. అందరికీ ఆడపెళ్లివారి సత్తా మీద అనుమానమే. పాపం ఉత్తినే భయపడ్డారుగానీ సత్రమయినా ఎంత కళకళలాడిపోతోందో! ఎటు చూసినా ముగ్గులే. ఎన్ని రకాలో. నడవలోనూ, మెట్లమీదా, గదుల్లోనూ వేసిన ముగ్గు వేయకుండా కళ్లు చెదిరిపోయేటట్లు. ఇంక రాత్రి పెళ్లి జరగాల్సిన హాల్లో అయితే పెద్ద కళ్యాణమండపం ముగ్గు. పెళ్లికొడుక్కి అతని స్నేహితులకీ అని కేటాయించిన గది వాకిటికి నెమళ్లు అల్లిన లేసుల తోరణం. అందులోనే చెరోపక్కా వధూవరుల పేర్లు కూడా అల్లికలో వచ్చేశాయి.

'ఏవే కావుడూ! ఈ ముగ్గులన్నీ మన స్వర్ణగాడు పెట్టినవేగా! ఈ లేసెప్పుడల్లిందే?' అంటూ అత్తగారు మనవరాలు అంటే కాబోయే కోడలి పనితనాన్ని చూసి మురిసిపోయింది.

'ఫలహారాలు కానిద్దురుగాని రండి' అంటూ చిన్న విస్తళ్లేశారు. వీళ్లు అద్దెకుండే ప్లీడరు గారి భార్య తన నోముల్లో శనగలు పరవాన్నం మిగిలిపోయాయని బాధపడుతుంటే 'మా మనవరాలి పెళ్లిలో చెల్లించేసుకోండ'ని చెప్పి సాయం చేసి పెట్టింది పెళ్లికూతురి బామ్మ సరమ్మగారు.

'సరి! సరి! ఫలహారాలంటే ఏ ఉల్లిపాయ పకోడీలన్నా వుంటా యనుకున్నా! ఈ నందికేశుడి ప్రసాదాలా?' అని వెక్కిరిస్తూనే పెళ్లికొడుకు పెద్ద బావగారు ఆ నాలుగ్గింజలూ నోట్లో వేసుకున్నాడు. ఆకలి మహాత్మ్యం అలాటిది మరి!

'బావా! నా మాట దక్కించా! స్వర్ణ నీ కూతురే అనుకో' అని దణ్ణం పెట్టింది కాముడు. ఇంటికి పెద్దల్లుడంటే వియ్యంకుడి కన్నా పవర్‌ఫుల్ కదా మరి. అందరూ తలోపక్కనా సామాన్లు సర్దుకుని స్థిమితపడ్డాక వియ్యపురాలిని పలకరించేందుకు విడిది గదికి వెళ్లింది సరమ్మగారు.

'ఏం వదినా! ప్రయాణంలో ఇబ్బంది పడలేదు కదా! అన్నగారేరీ కనబడ్డం లేదూ! ఇదిగో ఈ పట్టు మేం ఆడపెళ్లివారం. మీరు మగపెళ్లివారయి పోయారు. మీకు చేయాల్సిన మర్యాదలన్నీ మీ అమ్మాయికే అప్పజెప్పా. అన్నీ అడిగి చేయించుకోండి. రెండింటికి స్నాతకం పీటలమీద కూచోవాలిట. ఇంక మా బంగారుతల్లి స్వర్ణగాడు మీ ఇంట్లో అడుగుపెట్టిందంటే మీకెలా కలిసొస్తుందో చూడండి? దాన్ది మహారాణి జాతకం. ఎవరు దాని చెయ్యి పట్టినా ముద్రికా యోగం తప్పదని అది పుట్టినపుడే వాళ్ల తాతగారు రాసుంచారు. ఇంక మన భాస్కరం కలెక్టరయేది ఖాయం. అంతా మీ అదృష్టం వదినా! మా ఇంటిపిల్ల మీ ఇల్లు మెదుతోంది. ముగ్గులు చూశారా? మూడు రోజుల్నుంచీ పొద్దున్నే వచ్చి సాయంత్రం వరకు గుడినిండా కూడా వేసేసింది. పూజారిగారు ఎంత సంతోషించారో. ముహూర్తం టైంకి స్వామివారి తరఫున పూలహారాలు పంపిస్తానన్నారు. ఇంక నే మళ్లీ కనిపిస్తా' అంటూ వచ్చినావిడ మాట్లాడాల్సినవన్నీ మాట్లాడేసి తుఫానులా వెళ్లిపోయింది. అన్నీ తాను మాట్లాడేయడమే కానీ ఎదుటివాళ్లని నోరిప్పనిచ్చే స్వభావం కాదు ఆవిడది. బిక్క మొహం వేసుకుని తలాడించడమే తప్ప నోరు పెగిల్తేనా పెళ్లికొడుకు తల్లికి! పిల్లనిచ్చుకున్నామని చెప్పి పాతికేళ్లుగా అణిగిమణిగున్నావిడకి ఇప్పుడు కొత్తగా వియ్యపురాలి హోదా ఏం వస్తుంది? జిల్లా మొత్తంలో ఎవరన్నా సరమ్మగారి ముందు నోరెత్తడమే! ఇంకేవన్నా ఉందా!

అప్పుడు నోరు పెగిలింది పెళ్లికొడుకు నాలుగో అక్కగారికి. 'అమ్మా! అదేవిటే. అలా బిగుసుకుపోయావ్. మరీ విచిత్రం! తానొక్కతికే మనవరాలయినట్లు, దాన్ని చేసుకోవడం మన అదృష్టమన్నట్లు మరీ ఇంత గడుసుతనమా? పదివేల రూపాయల కట్నాన్ని కాదనుకుని అక్క మొఖం చూసి పిల్లని నువ్వు కడుపులో పడేసుకుంటుంటే, కాస్తన్నా గౌరవం లేకుండా రేపు నిజంగా మన బాచిగాడు పరీక్ష పాసయితే వాళ్ల గొప్పదనం వల్లే అంటుందేమో!

'పోన్లే! ఎవరి గొప్ప వల్లయితేనేం. వాడీ పరీక్ష గట్టెక్కి ఉద్యోగస్థుడయితే ఇంక మాకే బెంగా లేకుండా వాడి దగ్గిర పడుండవచ్చు. రెండేళ్లనించీ ఏ ఉద్యోగంలోనూ చేరకుండా రాత్రనక, పగలనక కష్టపడ్డాడు పిచ్చి నాగన్న. ఎన్నో చూస్తాం! ఎన్నో అనుకుంటాం! ఎవరి అదృష్టాలెలా వుంటాయో ఎవరికి తెలుసు? మన కావుడ్నిచ్చినపుడు వీళ్లది మూడూళ్ల కరణీకం. ముప్పై పుట్ల భూమి. వాళ్ల వూళ్లో ఎవరి పెళ్లన్నా మంగళ సూత్రాలూ మధుపర్కాలూ ఆవిడచేత్తో ఇవ్వాల్సిందే. ఎన్ని వందల పెళ్లిళ్లయాయో ఆవిడ చేతుల్లో. కాలం మహాత్మ్యం కాకపోతే విస్సన్న పంతులుగారి మనవరాలి పెళ్లి పక్క వూళ్లో దేవుడి గుడి సత్రంలో జరగడం ఏవిటి చెప్పు! కాలం ఎంతటి వాడ్నయినా వంచుతుందంటారు గానీ ఈవిడ్నేం చెయ్యలేకపోయింది. ఆస్తులు హరించిపోయినా ఝుంకారం పిసరంతయినా తగ్గలా!'

'వూరికే పోతాయేవిటీ ఆస్తులూ! మావిడిపళ్లు ఎవరెక్కువ తింటే వాళ్లకి బహుమానాలని చెప్పి కాపు అంతా వూళ్లో పిల్లలచేత తినిపించీ, ఎక్కడా పెళ్లి కావాల్సిన పిల్లలు కనబడకపోతే ఓ పాలేరాడికి ఆడవేషం వేసి, ఇంకో పాలేరాడికిచ్చి మూడు రోజులు, భోగం మేళంతో సహా పెళ్లి చేసీ, ఇద్దెల్ల పద్దని చెప్పి సుబ్బయ్యశెట్టికి వారానికో వెండి గ్లాసు పంపించీ, ఇలా ఒకటా, రెండా... ఇదేగా వీళ్లు చేసిన నిర్వాకం. చూడు పాపం! పిల్ల జమీందారల్లే పెరిగిన చిన్నబావ ఇప్పుడు మండుటెండలో సైకిలెక్కి తిరుగుతూ, కాంట్రాక్టరు దగ్గర మేస్త్రీ ఉద్యోగం చేస్తూ రెండు గదుల కొంపలో ఒక్కడూ ఇంటి భారాన్ని మోస్తూ! ఇన్నేళ్లయి కాపురానికొచ్చినా అక్కకి ఏ విషయంలోనూ నోరెత్తడానికి లేదు కదా! అదో వెర్రిబాగుల్ది. 'ఆ' అన్నా, 'వూ' అన్నా అన్నిటికీ బావురుమనడం తప్ప ఏమీ తెలియదు. అందుకే మనమందరం ఆవిడకి లోకువ. అక్కలాగే చేతకాని వాళ్లం అనుకుంటోంది.

'సర్లే! నాన్నగారు పేకాటలో కూచున్నట్లున్నారు. నువ్వు వెళ్లి నాన్నగారి దగ్గిర పది రూపాయలుంచి, పర్సు పట్టుకెళ్లి బాచికిచ్చేయి. తిరుగు ప్రయాణంలో అవస్థ పడిపోతాం. పెద్దాడ సూరం పిన్ని పిల్లలంతా ఆటలో దూరినట్లున్నారు. ఆఖరి దమ్మిడీ అయేవరకూ వదలరు. పేకాటలో స్థిరపడిపోయిన పెళ్లిపెద్ద పర్సు దాచేందుకు కూతుర్ని పంపించింది.

ఒకప్పుడు తూర్పుగోదావరి జిల్లాలో దర్జాలకీ, ధారాళానికీ పేరువడ్డది విస్సన్న పంతులు గారి కుటుంబం. ఆరుగురన్నదమ్ములకీ ఆయనే పెద్ద. ఆయనకి ఒక్కడే కొడుకయినా లంకంత లోగిట్లో ఎటు చూసినా జనమే. ఎవరికీ ప్రత్యేకించి చదువులూ లేవు. పనులూ లేవు. కరణీకం పనులూ, వ్యవసాయం పనులూ అన్నీ ఆయనే చూసుకునేవాడు. ఇంట్లో ఆడవాళ్లందరూ రకరకాలు వండుకోవడం, తిన్నంత తినడం, పారేసినంత పారేయడం, రెండ్రోజులకోసారి గూడుబండి కట్టుకుని కాకినాడెళ్లి మూడాటలూ చూసి తెల్లారాక ఇల్లు చేరడం. ఇంక మగవాళ్లయితే పగలంతా పేకాట. సాయంకాలం వేట. డిప్రెషన్ దెబ్బకి పైకి ఎవరికీ చెప్పుకోలేక, మింగలేక అప్పులవాళ్ల నూరుకోబెట్టలేక వున్నట్టుండి రాత్రి నిద్దట్లోనే ప్రాణాలు వదిలారు పంతులుగారు. అప్పుడందరూ కళ్లు తెరచి ఆవలిస్తూ ఆలోచించేలోపే సమయాతీతమయి పోయింది. ఆస్తులమ్మడం తప్ప ఎవరికయినా ఏ పనైనా చెయ్యడం వస్తే కదా! అయిదారేళ్లు గడిచేటప్పటికి పొలాలూ భూములూ తోటలూ ఆ వూరి కామందులకీ, కరణీకాలు దూరపు దాయాదులకీ అమ్మేసుకుని చెల్లాచెదురయిపోయి తలోచోటా నిజంగానే తలదాచుకుని బతుకుతున్నారు. కానీ ఇంత ఆస్తి ఇలా పల్లాములై పోయింది గానీ, డెబ్బై రూపాయల జీతానికి కొడుకు ఎర్రటెండలో మేస్త్రీ ఉద్యోగం చేయాల్సి వచ్చిందని గానీ, నలుగురాడపిల్లలూ, ఇద్దరు మగపిల్లలూ చకచకా ఎదిగొస్తున్నారని గానీ, సరమ్మ గారికీ బెంగాలేదు. ఎవడి తలరాతెలా వుంటే అలా జరుగుతుందని ఆవిడకో గట్టి నమ్మకం.

ఆ ఇంట్లో సరమ్మగారు తప్ప మిగతా వాళ్లంతా అనామకులే అయినప్పటికీ పద్దెనిమిదేళ్ల మనవరాలు స్వర్ణ మాత్రం నిజంగా బంగారుబొమ్మే! బామ్మకి తగ్గ మనవరాలు. ఏ పని చేసినా వచ్చూవరం వుండవు. ఓ లేసులల్లడమేనా, ముగ్గులు పెట్టడమేనా, గోరింటాకులు పెట్టడమేనా, ఎవరి పెళ్లికెళ్లినా రకరకాల పువ్వుల జడలెయ్యడమేనా అన్నిట్లోనూ ఫస్టే! అవన్నీ చూసే కదా పాపం బాచిగాడనబడే భాస్కరం మనసు పారేసుకున్నదీ! భాస్కరానికి బయట సంబంధం చేసుకుంటే వాళ్లిచ్చే పదివేలు కట్నంతో ఆఖరిదాని పెళ్లి చేయాలనుకున్న ఇంటిల్లిపాది ప్లాన్లూ తల్లకిందులయిపోయాయి. 'మరి చెల్లాయి పెళ్లెలారా? అంటే 'నే అప్పు చేసి పెళ్లి చేసి తరవాత తీర్చుకుంటానమ్మా! స్వర్ణని కాదంటే నేను పెళ్లే చేసుకోన'ని భీష్మించుకు కూచున్నాడు. మావయ్య చేసుకోపోతే నే నూతిలోకి దూకి ఛస్తానని ఇది బెదిరింపు. ఇంక ఎవ్వరూ మారుమాట్లాడకుండా, బాచిగాడి పరీక్షలవగానే ముహూర్తాలు పెట్టుకున్నారు. కన్యాదాత ఆఖరి చెక్క అమ్మేసి రెండు వేలు తెచ్చి వీళ్ల చేతుల్లో పెట్టగానే అది పట్టుకెళ్లి చెల్లాయి పెళ్లివారికి కట్నం అడ్వాన్సిచ్చేశారు. ఇంక ఇప్పుడు పెళ్లి ఖర్చులకి అటూ ఏవీ లేదు, ఇటూ లేదు. ముహూర్తబలం వల్ల ఆ శుభకార్యం జరగాల్సిందే.

'మా మనవరాలు పుట్టినపుడే మా పెద్దవాళ్లు కట్టించిన వీరేశ్వరుడి గుళ్లో పెళ్లి చేస్తామని మొక్కుకున్నాం' అని చెప్పి సరమ్మగారు వాళ్లు కాపురం వుంటున్న ఊళ్లో సత్రంలో పెళ్లి అని నిర్ణయించేసింది. అందరికీ కార్డు మీద చేతిరాత ఆహ్వానాలే. శుభలేఖల ఖర్చెందుకు వూళ్లో వాళ్లని బాగుచేయడానికి కాకపోతే! మరుదులకీ ఆడపడుచులకీ తేవాల్సిన బహుమతులన్నీ పురమాయించింది. రామ్మూర్తి పానకం బిందెలూ, కాళ్లు కడుగు పళ్లెం, సుందరీ వాళ్లు మధుపర్కాలూ, సుబ్బులు పెళ్లికొడుక్కి వాచీ, రాజారాం వాళ్లు అప్పగింతల బట్టలూ, పెద్ద మేనత్త చేత్తో తలా రెండొందలూ అయిదు రకాల ఫలహారాలూ ఇలా పెళ్లికూతురికిచ్చే మిఠాయిలతో సహా బహుమతుల రూపంలో వచ్చే ఏర్పాటు చేసింది. కాని ఎంత చేసినా మరి ఆ రోజుల్లో ముహూర్తం అయ్యాక పెట్టేదే పెళ్లి విందు కదా! సొంత ఊళ్లో చేస్తే భరాయించలేమని పక్క ఊళ్లో క్లుప్తంగా చేద్దామన్నా మూడు భోజనాలు మూడు టిఫిన్లూ తప్పదం లేదు. దగ్గిరవాళ్లే వందమందయ్యారు.

మొత్తానికి మధ్యాహ్నం టిఫిన్లు గట్టెక్కారు. తెల్లారగట్ల లేచి ఎండలో ప్రయాణం చేసి వచ్చారేమో మగపెళ్లివారంతా సొమ్మసిల్లి పడున్నారు. రాత్రి వంటలవుతున్నాయి. వంట చేసేది ఒక ముసలాయనా, మనవడూ. వాళ్లూ సత్యం జట్టులో వాళ్లే. కాని పెద్ద జట్టు మొత్తం కాకినాడ తాసీల్దారు గారి అమ్మాయి పెళ్లికి బుక్కయిపోయింది. సత్యం మాత్రం ఏడు మైళ్లు సైకిల్ మీద తిరుగుతూ అటూ ఇటూ మాట రానీయకుండా చూస్తున్నాడు. అరటికాయుప్మాకూర, కందిపొడి, గోంగూర, దోసావకాయ, పప్పుపులుసు చిన్నవడ్డనలద్దు అన్నీ సరిచూసుకుని ఇంక నే వెడుతున్నానని అమ్మగారికి చెప్పాలనుకుంటూ ఆరున్నరకల్లా సైకిలెక్కి వెళ్లబోతున్న సత్యం ఒక్కసారి ఆగిపోయి చూస్తూ నిలబడిపోయాడు.

తెల్లగా మెరిసిపోతూ రంగురంగుల జంపఖానాలు అలంకరించుకుని పువ్వుల దండలు చమ్కీలు సింగారించుకుని గంటలు మోగించుకుంటూ నిజమైన పెళ్లివారిప్పుడొస్తున్నారా అన్నట్లు పాటలూ, పద్యాలతో హోరెత్తుతూ సత్యం ముందు బళ్లు. ఆడామగా పట్టుబట్టలతో వున్న అన్ని నగలతో సెంటు సువాసనలతో పిల్లాపాపా కలిసి అథమపక్షం నాలుగొందలమంది. ఇంకా ఎంతమందున్నారో వెనకబడ్డ బళ్లు వచ్చి కలుస్తున్నాయి.

'దండాలు పెద్దమ్మగారూ', 'సంతోషం అమ్మగారూ', 'ఇంకా మామీద దయుంచారండమ్మా', 'మన బామ్మర్ది గారికీ ఇత్తన్నారంటగా', 'అబ్బో ఎంత బాగుందారో!', 'ఇక మన బంగారమ్మ కలెక్టరు గారి భార్య అయిపోతారన్నమాట' ఇలా పట్టరాని సంతోషంతో వానాకాలపు జల్లు మీద జల్లులా జడివానలా ఒకటే జనం.

'ఏం కనకయ్యా బాగున్నావా? మమ్మల్ని మర్చిపోయావనుకున్నా, ఏరా కన్నలూ అప్పుడే మనవడుట్రా నీకూ, ఏం పేరు పెట్టావు? బాపినీడు గారూ మామూల పొలం ఎలా వుంటుందోనని వెనకాడారు. మొన్న నలభై అయిదు బస్తాలయ్యాయట కదా!' ఇలా ఒక్కొక్కళ్లనే పలకరిస్తోంది. అందరికీ వాకిట్లో జంపఖానాలు పరిపించి కూచోపెట్టించింది. కోడలు

## వేప పువ్వే తియ్యన

పెద్దోడు...
ఉగాది పండుగకు వస్తానన్నాడు
రైలు రావటానికి ఇంకా మూడు గంటలుంది
గుండెల్లో అలజడి... ఏదో భయం
సవ్యంగా రైలు రావాలని ఎన్ని మొక్కులో...
రైలు ప్రయాణం ఎంత చేదుగా మారింది!

జీతాలొచ్చి వారం కాలేదు
అయినా అప్పులకు తంటాలు
పెద్దాయన పర్సు ఖాళీ...
మార్కెట్లో అన్నీ గాయకం
జేబుకు అనునిత్యం గాయం!
ఉదయం ధరలు... సాయంత్రం ఉండవు
ధరలెంత మండిపోతున్నాయ్
రేటు వింటే స్వీటు కూడా చేదే!

క్రికెట్‌లో పాక్ ఓటమి
గుజరాత్‌లో గొడవలు... మళ్లీ కర్ఫ్యూ
అయోధ్యలో రాముడి ఆనవాళ్లు కావాలన్న
కోర్టు!
మళ్లీ అలజడి... గొడవలు... కాల్పులు
నిత్యం మతాల గొడవలు... కులాల కొట్లాటలు
మానవ అనుబంధాలు...
ఎంత చేదుగా మారాయి!

స్వభాను నామ ఉగాది రానే వచ్చింది
చిన్నోడు కోసుకొచ్చిన
పెరటిలో వేపపువ్వు చూడగానే
ప్రాణం లేచి వచ్చింది
ఎందుకంటే దాని పేటెంట్ హక్కులు
ఇంకా నాకే ఉన్నాయి
కాస్త పువ్వు నోట్లో వేసుకున్నాను
నములుతుంటే... ఎందుకో
వేపపువ్వే తియ్యగా అనిపించింది!

- పండా నాగేంద్ర త్రినాథ్

కంగారు పడిపోతోంది. 'అత్తయ్యా! ఎలా? ఎలా?' అంటూ భయానికి అప్పుడే ఆ అర్భకురాలి కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి.

'నువ్వు మాట్లాడకుండా ఇక్కడ నించి పోయి మీ అమ్మతో కబుర్లు చెప్పుకో! విడిదిల్లు విడిచిపెట్టి రాకు. మన చవటని నేనోసారి పిలిచానని చెప్పు'. అదెవరో తెలుసు కాబట్టి వెంటనే వెళ్లిపోయింది. ఇంకా అప్పటికి ఆ సత్రంలో కరెంటు దీపాలు లేవు. అన్నీ నూనె దీపాలే. వాటికన్నా గాడిపొయ్యి వెలుతురే మెరుగ్గా వుంది. భోజనాల టైంకి వెలిగించుకోవచ్చునని చెప్పి రెండు పెట్రోమాక్స్ లైట్లు తెప్పించుంచారు. కాసేపటికి ఆవిడగారి వంశోద్ధారకుడు కన్యాదాత వణుక్కుంటూ వచ్చాడు 'ఏవిటే అమ్మా! పిలిచావుట' అంటూ.

'నే బతికుండగా తీరువొస్తుందటరా నీకు! మన వూళ్లో పెళ్లి పెట్టుకుంటే తట్టుకోలేమని చెప్పేగదా. దిక్కుమాలిన వాళ్లల్లా ఈ సత్రంలో చేస్తున్నాం. చిన్నప్పుడే మొక్కుకున్నామని పుట్టెడబద్ధాలాడీ! ఎక్కడెక్కడి వాళ్లకో అయిదు రోజుల పెళ్లి చేసినదాన్ని సొంత మనవరాలి పెళ్లి అర్ధరాత్రి ముహూర్తం ఏరీకోరీ పెట్టించి గుట్టుచప్పుడు కాకుండా కానిస్తుంటే నీకేవన్నా చీమకుట్టినట్లన్నా వుందా! బాధ్యత ఎప్పటికి తెలుస్తుందిరా? మన వూరెప్పుడెళ్లావ్? వీళ్లందరినీ ఎప్పుడు పిలిచావ్? పోనీమంటే ఇలా పిల్చానని నాతో మాట మాత్రమయినా చెప్పావా? మన ఇల్లమ్మేశాక నేనావూళ్లో అడుగుపెట్టానా? ఇప్పుడే గంగలో దూకమంటావురా?'

'కంగారు పడకండమ్మా. నేనో గంటాగి వెడతాగా! ఇప్పటి మటుక్కు అన్నీ సరిపోతాయి. ఒక్క మూట బియ్యం పడేయించండి చాలు. మీకు మాట రానిస్తానా' అంటూ ఎక్కిన సైకిలు దిగి, అరటి గెల ముందేసుకున్నాడు సత్యం.

'ముహూర్తం పెట్టడానికి పేరయ్య శాస్త్రిగారు మనింటికి వచ్చినపుడే అడిగానే ఓ అయిదొందలు పెళ్లినాటికి సద్దమని. శివరాత్రెళ్లాక రమ్మన్నారు. ఆ డబ్బులు తీసుకోడానికి వెళ్లినపుడు అబ్బాయిగారిటొచ్చే రేంటో అని అందరూ అడుగుతుంటే మిమ్మల్ని పెళ్లికి పిలవడానికి వచ్చారని ఆయన చెప్పారు. ఒకళ్లకి చెప్పి ఇంకోళ్లకి చెప్పకపోతే బాగుండదని అందరికీ చెప్పొచ్చా. శుభలేఖలివ్వలేదు గదా ఎవరూ రారేమోలే అని నీతో చెప్పలేదు. నిజంగా ఇంతమందీ వస్తారనుకోలేదే'.

'సర్లే! వాకిట్లో అందరినీ జాగర్తగా పలకరించు. పాపం వాళ్లేవేళప్పుడు బయల్దేరారో! దాహం కనుక్కో. భోజనాల ఏర్పాటు చేసి పిలుస్తా'. పెళ్లికని వచ్చిన రైతులెవరూ చేతులూపుకుంటూ రాలా! పది అరటి గెలలూ, గుమ్మడికాయలూ, ఆనపకాయలూ, బండెడు ఘుమఘుమలాడిపోయే చిన్న రసాలూ, పెళ్లి వేళ దాహానికని కొబ్బరిబొండాలూ, అయిదు వీశల నెయ్యీ, అరిశలూ అన్నీ తెచ్చారు గానీ బియ్యం మూట మాత్రం ఎవరూ తేలేదు. ధైర్యంగా మిగతా వంట కానిస్తున్నారు. ఎసళ్లు మరిగిపోతున్నాయి. ముందు మగపెళ్లివారి భోజనాలవుతున్నాయి. వంటసావిట్లో సత్రం గుండిగలు మెరిసిపోతున్నాయి. నెమ్మదిగా ప్రభాకరాన్ని పిలిచింది.

'ఒరే! దొడ్డిగుమ్మం దగ్గరికి కళ్లిగాడ్ని బండి తోలుకురమ్మను! ఇదిగో ఈ గుండిగట్టికెళ్లి కాస్త అసింటా వున్న ఏ కొట్లోనో పెట్టి బస్తా బియ్యం మంచివి వేయించుకురా! ఎవరికంటా పడకూడదు. తెల్లారేటప్పటికి విడిపించుకుంటాం అని చెప్పు. ఇక్కడున్నట్టు రావాలి. ఈ విషయం బయటకి పొక్కిందో అదిగో ఆ గుళ్లో కూచున్న మూడోకంటివాడి సాక్షిగా ఈ నూతిలోకి తోసేస్తా నిన్ను! వినిపిస్తోందా?' వాడు మహా అసాధ్యుడు. నెమ్మదిగా గుండిగ నీళ్లు పారబోసి బండిలో పెట్టుకునెళ్లి పావుగంటలో బియ్యం బస్తాతో తిరిగొచ్చాడు.

'ఎవరన్నా చూశారేమిట్రా?'

'లేదు. దొడ్డా! కొట్లో కూడా వెలుతురు లేదు. తెల్లారేలోపు వచ్చి తీసుకుంటాం అని తీసుకొచ్చా... అవునూ! ఇప్పుడు లేని డబ్బులప్పుడెక్కడ్నించొస్తాయే?'

'నీ అత్తారిస్తార్లే వెధవా! అన్నీ ఆరాలే! ఇంక ఇక్కడ చేసింది చాలు గానీ పోయి వడ్డన కలుస్తోందో, లేదో చూడు. అరటికాయ ముక్కల్లో అగరొత్తులు గుచ్చారో లేదో! కల్లుగాడ్ని రాయబారం పద్యాలందుకోమన్నానని చెప్పు!'

ఆఖరి బంతి భోజనాలవుతుండగానే పెళ్లికూతురికి తలంటు పోయడానికి వెళ్లిపోయింది. పెద్ద తలకట్టు. సాంబ్రాణి పొగేసి చిక్కులు తీసి పొడుగు మొగ్గలూ కనకాంబరాలూ దవనంలో వదులు వదులుగా వంకీల జడ. జడ కుప్పెలు. జడ చూస్తేనే కళ్లు తిప్పుకోలేం. ఎప్పుడో ఏణ్ణర్థం నించీ దాచుంచిన తోపురంగు ఆరణి పట్టుచీర ప్లీడరుగారి అబ్బాయి పెళ్లికి కావుడికి పెట్టింది. ఇప్పుడు గౌరీపూజకి అక్కరకొచ్చింది. నిద్దర కళ్లతో పెళ్లికూతురు మరీ ముద్దొస్తోంది. కోరుకున్న మొగుడు దొరికాడన్న సంబరంతో కలకల్లాడిపోయే ఆ చక్కదనానికి వేరే అలంకారాలెందుకుట.

నాలుగుంపావుకి ముహూర్తం అయింది. స్వామివారి తరపున వచ్చిన గుండుమల్లె పూలదండలతో పెళ్లి మండపం గుబాళించిపోయింది. వాళ్లిద్దరి తలంబ్రాల పోటీ కాదుగానీ చుట్టూ మూగిన పిల్లమేళం నెత్తిన కూడా అక్షింతలు కనిపించాయి. పెళ్లికొడుక్కి పిల్ల ధ్యాస తప్ప వేరే ఏ ధ్యాసా లేదు. ఇక చదివింపులు మొదలయ్యాయి. అన్నీ విస్సన్న పంతులుగారి మనవరాలు చి॥ సౌ॥ స్వర్ణలతాదేవికే. పెద్దిరాజుగారూ, కనకయ్యగారూ, బాపినీడుగారూ, వెంకాయప్పగారూ, సీతయ్యశెట్టి గారూ, భద్రిరాజూ, వెంకట్రావుడూ... చదివింపులవుతూనే ఎండెక్కే లోపల ఊరు చేరాలని బళ్లు బయల్దేరాయి. ఫలహారాల పర్యవేక్షణకి వంటసావిట్లోకి వెళ్లింది కళ్లు తుడుచుకుంటూ సరమ్మగారు. ఊళ్లోకి బండెక్కి షికారెళ్లిన గుండిగ మళ్లీ వచ్చి నేస్తాల సరసన ఏవీ ఎరగనట్లు గట్టెక్కింది.

అప్పగింతలయి పెళ్లివారెళ్లిపోయాక చూసుకుంటే అన్ని ఖర్చులూ పోనూ, రెండొందల రొఖ్ఖం, మూడు నెలల గ్రాసం మిగిలాయి. సత్యం చేతిలో ఏభై రూపాయలు పెట్టబోతే 'వద్దంటే వద్దు! స్వర్ణమ్మ నాకేవీ కాదా' అంటూ దణ్ణం పెట్టి, సైకిలెక్కి వెళ్లిపోయాడు.

అలా మావయ్యని వరించి పెళ్లాడిన స్వర్ణ తాతగారు వ్రాసిన జాతకం పొల్లుపోకుండా మొగుడికి ముద్రికాయోగం పట్టించి, బామ్మ దీవెనలు పొల్లుపోకుండా తన ఇల్లు వేయిళ్ల మొదలై, చుట్టాల సురభి అయి, బంధువుల భాగ్యశాలి అయి, నూలు లేని పుట్టం కట్టుకుని, లక్కలేని సొమ్ములు పెట్టుకుని తన పెళ్లి స్వర్ణోత్సవం కూడా జరుపుకుంది.

ప్రస్తుతం అమెరికాలో పుట్టిపెరిగిన తన మనవరాలి పెళ్లి ఏర్పాట్లు చేయాలని తాపత్రయపడుతోంది. మాటిమాటికీ బామ్మని తల్చుకుంటూ ఆవిడెంత కష్టపడిందోనని నిట్టూరుస్తోంది. ఇంకా ముహూర్తం నెల్లాళ్లుంది. ఆడపెళ్లివారూ, మగపెళ్లివారూ అందరూ అక్కడ్నించి రావాల్సిందే. ఇక్కడ లంకంత కొంపలో పెద్దవాళ్లు తప్ప ఎవరూ లేరు. పెళ్లికూతురికి ఇండియాలోనే పెళ్లిచేసుకోవాలని మనసేయడంతో ఇరుపక్షాల వారూ సగం బోయింగు మాట్లాడుకుని వస్తారుట ముహూర్తానికి మూడు రోజుల ముందు. 'ఎలాగో! ఏవిటో! ఏం చెయ్యాలో' అని కంగారు పడుతుంటే భాస్కరరావు గారి గొంతు వినిపించింది.

'ఇదిగో బంగారూ! విశ్వం ఫోన్ చేశాడు. పెళ్లి పనులన్నీ ఎవరో ఈవెంట్ మేనేజరుట. వాళ్లకప్పజెప్పాడుట. మనిద్దరం దేనికీ హైరానా పడక్కర్లేదు. అన్నీ వాళ్లే చూసుకుంటారుట.

'మనల్ని కష్టపెట్టకూడదని వాడికెంత తాపత్రయమో! పోనీలే ఇదీ మన మంచికే'.

'ఎందుక్కాదు! మనకన్నా పుచ్చుకునే వాడికి మరీ మంచిది. మూడు లక్షల అడ్వాన్సు!'

'అడ్వాన్స్ మూడయితే మొత్తం బిల్లెంతవుతుందో! ఇంతకీ అన్ని లక్షలుచ్చుకుని వాళ్లేం పనులు చేస్తారో!'

'పెళ్లిపిలుపులు, రిజర్వేషన్లు, హోటళ్లు, పెళ్లి బ్రాహ్మణులు, వీడియోలు, వాయినాలు, బహుమతులు, రిసెప్షను కచేరీ... ఒకటేవిటి మూడు ముళ్లేయడం తప్ప అన్నీ వాళ్లే చేస్తారుట. పెళ్లి పెత్తనం చేద్దామని ఆశపడ్డట్టున్నావ్ పాపం! మనం వాళ్లెక్కడ కూచోమంటే అక్కడ కూచోవాలి. పెట్టినది తినాలి! అన్నట్టు కాయితం పెన్ను పట్రా. మనవాళ్ల లిస్టు తయారు చేద్దాం- అదొక్కటే మనం చేయవలసిన పని'.

పెన్నందిస్తూ అడిగింది- 'మరి పెళ్లికొడుకు తల్లి ముహూర్తానికి చీర తెచ్చుకుంటుందా? అదీ ఇందులోనేనా! లేకపోతే అత్తగారి లాంఛనం చీర ముందే ఇచ్చేయమంటుందా?'

'నాకేం తెలుసు! వెళ్లి గుండిగనడుగు తెలుస్తుంది'

'గుండిగనడగడమేం ఖర్మ. ఏకంగా బామ్మనే అడుగుతాను రాత్రి కల్లోకొచ్చినపుడు. అయినా ప్రేమ పెళ్లంటారు. ఇంత ఖర్చేవిటో! నాకప్పజెపితే ఒక్క లక్ష మిగిల్చి ఏ పేదింటి పిల్లకో అక్షింతలు పడేయించక పోదునా! డబ్బు లక్ష్యాలూ లేవు. ఏ లక్ష్యాలూ లేవు. పాపం బామ్మకి తెలిస్తే ఏం అనేదో!'

✦